నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# రంగారెడ్డి

ఆదివారం 24 డిసెంబర్ 2023
SUNDAY, DECEMBER 24, 2023 | RANGAREDDY | పేజీలు PAGES : 8



షాదనగర్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

# వైకుంఠ వైభవం

**ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. వైష్ణవ క్షేత్రాల్లో విష్ణుమూర్తిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద క్యూ కట్టారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆయా ప్రాంతాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. –న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

లోపలి పేజీల్లో..



మొయినాబాద్‌లోని కనకమామిడిలో స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు



చిలుకూరు బాలాజీ ఆలయంలో స్వామివారికి నమస్కరిస్తున్న భక్తురాలు



# నేవీ రాడార్‌పై మళ్లీ కదలిక

- వికారాబాద్ జిల్లాలో నేవీ రాడార్ ఏర్పాటుకు సన్నాహాలు
- నాలుగేండ్ల క్రితమే ఏర్పాటుకు కేసీఆర్ సర్కార్ కృషి
- కేంద్ర ప్రభుత్వ తీరుతో ఆగిపోయిన ఒప్పంద ప్రక్రియ
- ప్రస్తుత ప్రభుత్వ సానుకూలతతో మళ్లీ కసరత్తు షురూ
- దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌ను సందర్శించిన కలెక్టర్
- ఒప్పందం పూర్తైతే నేవీ ఆధీనంలోకి 2700 ఎకరాలు
- రూ.1900 కోట్లతో నేవీ రాడార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

వికారాబాద్ జిల్లాలో ప్రతిష్టాత్మక నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుపై మళ్లీ కదలిక వచ్చింది. ఇటీవల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో చర్చించిన జిల్లా ప్రజాప్రతినిధులు, నేవీ రాడార్ ఏర్పాటుకు స్థానికుల అభిప్రాయంతోపాటు పూర్తి సమాచారం ఇవ్వాలని సూచించారు. రూ.1900 కోట్లతో పూడూర్ మండలం దామగుండంలోని రిజర్వు ఫారెస్ట్‌లో ఇండియన్ నేవీ రాడార్ వ్యవస్థను 2700 ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించింది. ఈ మేరకు శనివారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆ ఫారెస్ట్‌ను సందర్శించి, అనంతరం స్థానికులతో చర్చించారు. నాలుగేండ్ల క్రితమే నేవీ రాడార్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకునేందుకు కేసీఆర్ సర్కార్ కృషి చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తమ ఆధీనంలోని భూములను రాష్ట్ర సర్కార్‌కు ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో నేవీ రాడర్ ఏర్పాటు అంశాన్ని గత సర్కార్ పక్కన బెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం నేవీ రాడార్ ఏర్పాటుకుగాను సానుకూలంగా ఉండడంతో ఆ దిశగా జిల్లా అధికార యంత్రాంగం ప్రక్రియను వేగవంతం చేసింది.

–వికారాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ)



కొత్త ఏడాది వేడుకల వేళ..

# ప్రత్యేక నిఘా

**పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం**
**డ్రగ్స్ వినియోగంపై ఉక్కుపాదం**
**మైనర్లకు మద్యం అమ్మితే కఠిన చర్యలు..**
**రాచకొండ సీపీ సుధీర్‌బాబు**



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు..

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 23 : నూతన సంవత్సర వేడుకలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిషనరేట్ పరిధిలోని పబ్‌లు, బార్లు, రెస్టారెంట్లు, ఫామ్ హౌస్, వైన్ షాప్, ఈవెంట్ నిర్వాహకులతో శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్, ఎస్‌వోటీ, షీటీమ్స్, పెట్రోలింగ్ వంటి బృందాలు విధుల్లో ఉంటాయన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో అవుట్ డోర్ ఈవెంట్లలో డీజేలకు అనుమతి లేదన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రజలందరూ బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేడుకలలో డ్రగ్స్ వినియోగానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు లేకుండా నిర్వాహకులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుల నిఘా కట్టుదిట్టంగా ఉందని, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. నిర్ణీత సమయానికి వైన్స్‌లు మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయిస్తే ఆయా దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల పార్కింగ్‌కు సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు విస్తృతంగా ఉంటాయని, నిర్లక్ష్యంగా, అత్యంత వేగంగా వాహనాలు నడుపొద్దన్నారు, తాత్కాలికంగా ప్లైఓవర్లు మూసేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీపీలు రాజేశ్ చంద్ర, శ్రీనివాస్, సాయిశ్రీ, జానకి, ఇందిరా గిరిధర్, మురళీధర్ పాల్గొన్నారు.